సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 1 । మార్చి । 2023



స్తంభించిన రాకపోకలు

పాడేరు ఘాట్‌రోడ్‌లో లోడ్‌తో వెళ్తున్న లారీలు రెండు చోట్ల లారీలు మొరాయించాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తింది. 8లో



విస్తృతంగా తనిఖీలు

మావోయిస్టు నేత రైనో అరెస్టు నేపథ్యంలో అప్రమత్తమైన వై.రామవరం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. 8లో



భూరీసర్వే వేగవంతం

భూరీసర్వే వేగవంతం చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ వీఆర్వోలు, సర్వేయర్లు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. 8లో

న్యూస్‌రీల్

సక్రమంగా మెనూ

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



బోదునూరు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కూనవరం: విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, వారికి మెనూ సక్రమంగా అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మండలంలో బోదునూరు, పైదిగూడెం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ అమలు తీరును పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. పాఠశాలకు వచ్చేముందు షూ తప్పనిసరిగా వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అలాగే పైదిగూడెంలో గిరిజన మహిళలు నిర్వహిస్తున్న పట్టుపురుగుల కేంద్రాన్ని పరిశీలించారు. వారినుంచి ఆదాయ వివరాలను తెలుసుకున్నారు. నాణ్యమైన పట్టు పురులను పెంచి మంచి ఆదాయం పొందాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

12 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

రంపచోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. మోహన్ స్పింటెక్, డీ మార్ట్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాకు 37 మంది నిరుద్యోగ యువత హాజరు కాగా వీరిలో 12 మంది ఎంపిక చేసినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి. ప్రశాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్లు, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ యం. సతీష్ కుమార్ పాల్గొన్నారు.

గ్రేడింగ్ చేసి విక్రయిస్తే మంచి ధర

నాబార్డు డీజీఎం శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు డీజీఎం శ్రీనివాసరావు

జి.మాడుగుల: గిరిజన రైతులు సేకరిస్తున్న అటవీ ఉత్పత్తులను గ్రేడింగ్ చేసి విక్రయిస్తే మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని నాబార్డు డీజీఎం శ్రీనివాసరావు సూచించారు. మత్స్యదేవత గిరిజన రైతు సేవా, ఉత్పత్తుల మ్యాక్స్ సొసైటీ (ఎఫ్‌పీవో) రికార్డులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారీ వ్యవస్థ బారిన పడకుండా రైతులు తమ పంటలకు గిట్టుబాటు ధరలు పొందాలని ఆయన సూచించారు. అటవీ ఉత్పత్తులను గ్రేడింగ్ చేస్తే మార్కెట్‌లో మంచి ధరలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఐఐఎంఆర్ డాక్టర్ యశ్వంత్, ఎస్‌వీడీఎస్ కార్యదర్శి కె.జోగినాయుడు తదితరులు మాట్లాడారు. సీఈవో ఐసరం హనుమంతరావు, చైర్మన్ జి. కళావతి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో ఉపేంద్ర ప్రతిభ



ఉపేంద్రను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి, అధ్యాపకులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న గిరిజన విద్యార్థి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ కె.ఉపేంద్ర రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యాడు.ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అతనిని ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబ్బాయి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రసూల్, పీడీ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రమేష్, గౌరీశంకరరావు అభినందించారు.

రోడ్డేస్తే.. గట్టెక్కినట్టే!

గోదావరికి వరదలొస్తే కూనవరం మండలంలో ప్రజలకు కంటిమీద కునుకు ఉండదు. రోడ్లన్నీ మునిగిపోవడంతో
గ్రామాలు దాటే మార్గం ఉండదు. ఈ పరిస్థితుల్లో అటవీ ప్రాంతంలోని బోదునూరు– తాటిలంక మార్గమే ఆధారం. ఈ మార్గం మీదుగా చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి చేరుకుని అక్కడి ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇంతటి ప్రాధాన్యమున్న రహదారి అభివృద్ధి ప్రతిపాదనల దశలోనే ఉంది.

- ప్రతిపాదనల్లోనే బోదునూరు– తాటిలంక రహదారి
- వరదలొస్తే 56 గ్రామాలకు ఇదే దిక్కు
- కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి సమస్య
- పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ



అభివృద్ధికి నోచుకోని బోదునూరు - తాటిలంక రహదారి

కూనవరం: ఎంతో ఉపయోగకరమైన బోదునూరు– తాటిలంక రహదారిని పక్కా రోడ్డుగా అభివృద్ధి చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మండలంలోని 56 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కూనవరం నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రోడ్డు వర్షాకాలంలో గోదావరి ముంపునకు గురవుతుంది. దీంతో ఈమార్గంలో రాకపోకలు పూర్తిగా స్తంభిస్తాయి. వరదలు తగ్గుముఖం పట్టినప్పటికీ పోలిపాక వద్ద రోడ్డు కొట్టుకుపోయి పెద్దపెద్ద గోతులు ఏర్పడటం వల్ల నాలుగైదు రోజుల వరకు వాహనాలు నడిచే పరిస్థితి ఉండదు. ఈ పరిస్థితుల్లో దాదాపుగా వర్షాకాలంలో మండలంలోని ప్రజలంతా బోదునూరు, తాటిలంక మీదుగా ఏడుగురాళ్లపల్లి వరకు ఉన్న 22 కిలోమీటర్ల రహదారిపై ఆధారపడుతుంటారు. వరదల సమయంలో ఏర్పాటుచేసే పునరావాస కేంద్రాల బాధితులు, పోలవరం పునరావాస కాలనీల ప్రజలు ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు.

తెలంగాణకు ఇదే మార్గం..
అటవీ ప్రాంతంలో ఉన్న ఈ రహదారి మీదుగా రోగులను తెలంగాణలోని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుంటారు. కోతులగుట్ట, పైదిగూడెం, బోదునూరు, పాలగూడెం, మెట్టరామవరం, టేకులొద్ది, సీతారాంపురం, అభిచర్ల, కుటూరు, రేపాక కాలని, గండికొత్తగూడెం తదితర గ్రామాల్లోని గిరిజనులకు, ఎత్తయిన కొండలపై నివసిస్తున్న 11 గ్రామాల్లోని కొండరెడ్లకు ఈ మార్గమే ఆధారం. ఈ రహదారిని 2005లో గ్రావెల్ రోడ్డుగా మార్చారు. ఆ తరువాత నుంచి ఈ మార్గం అభివృద్ధిని విస్మరించారు. 2021లో వరదలకు ముందు అప్పటి చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ పీవో ఆకుల వెంకటరమణ హయాంలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. 2022 జులై, ఆగస్టుల్లో భారీ వర్షాలకు, రహదారి పూర్తిగా దెబ్బతింది. ఈ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని శబరి కొత్తగూడెంలో నిర్వహించిన ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. దీనిపై పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

నవరణతో ప్రతిపాదనలు కోరిన అటవీశాఖ
బోదునూరు– తాటిలంక రోడ్డు 7.5 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఆమోదం నిమిత్తం ఐటీడీఏ ఇంజినీరింగ్ శాఖ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని కూనవరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మోహిని విజయలక్ష్మి చెప్పారు. దీనివల్ల అడవికి



రహదారులతో సహా గోదావరి వరదముంపునకు గురైన టేకులబోరు గ్రామం

ఎక్కువ నష్టం జరిగే అవకాశం ఉన్నందున సవరణతో మళ్లీ పంపించాలని వారికి లేఖద్వారా తెలియజేశామన్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య

బోదునూరు, తాటిలంక రోడ్డుకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఐటీడీఏ పీవోకు వినతులు అందాయి. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. రోడ్డు సమస్యను కొద్దిరోజుల క్రితం ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆర్టికల్ 275 నిధుల నుంచి ఈ రహదారి పనులు చేపడతామని ఆయన తెలిపారు.

– కె. ప్రవీణ్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ, చింతూరు ఐటీడీఏ

వైఎస్సార్ రైతు భరోసా జమ

1,63,009 మందికి రూ.34,09,59,500 జమ

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుజేస్తున్న వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో ఈఏడాదికి సంబంధించి 3వ విడత ఆర్థికసాయాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. గుంటూరు జిల్లా తెనాలిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా నగదు జమ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం సందేశాన్ని జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన గిరిజన రైతుల స్థానిక కాఫీ అతిథి గృహంలో వీక్షించారు. జిల్లాలోని 1,63,009 మంది రైతుల ఖాతాల్లో రూ.2 వేల చొప్పున రూ.34,09,59,500 నగదు జమ అయింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును రైతులకు వ్యవసాయశాఖ ఏడీలు



రైతులకు చెక్కును అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

జి.విజయ్‌కుమార్, ఎం.వి.శ్రీనివాస్, ఎం.శ్రీధర్ రావు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విజయమే లక్ష్యం కావాలి

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు పిలుపు

మారేడుమిల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంతో పనిచేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన వర్తక సంఘ కేంద్రం వద్ద మంగళవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, లబ్ధి వివరాలను గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకన్నా ఎక్కువ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. 25 సంవత్సరాలు అధికారంలో ఉన్న టీడీపీ చేయలేని అభివృద్ధిని రంపచోడవరం



సమావేశంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

నియోజకవర్గంలో జగనన్న ప్రభుత్వం చేసి చూపించిందన్నారు. మళ్లీ జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా అందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీలు లక్కొండ రవికుమార్, తుమ్ముడు లత, మండల కోఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, సర్పంచ్ కొండ జాకబ్, వైస్ సర్పంచ్ బొడ్డేటి వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు, యూత్ అధ్యక్షుడు గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

‘జల్‌జీవన్’ వరం

- ఇంటింటికీ రక్షిత నీరు సరఫరా లక్ష్యం
- చురుగ్గా పనులు



పైపుల నాణ్యతను పరిశీలిస్తున్న గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారి లీలాకృష్ణ

సాక్షి,పాడేరు: గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జిల్లాలో 2,722 పథకాలకు రూ.34,895.70 లక్షలు మంజూరయ్యాయి. తాగునీటి సమస్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేస్తోంది. దీనిలో భాగంగా అత్యవసరంగా తాగునీటి పథకాలు అవసరమైన 365 గ్రామాలను గుర్తించింది. మార్చి మొదటి వారం నాటికి



జీకేవీధి మండలం మొండిగెడ్డ ప్రాంతంలో చురుగ్గా జరుగుతున్న ట్యాంక్ నిర్మాణ పనులు

పనులు పూర్తిచేసి ఇంటింటికి సురక్షిత నీరు అందించాలన్న లక్ష్యంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉన్నారు. సంబంధిత అధికారుల ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన పథకాల పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు టెండర్ల ప్రక్రియ వేగవంతం చేస్తున్నారు. పథకాల పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవోలు పర్యవేక్షిస్తున్నారు.

డివిజన్ల వారీగా..
జిల్లాలో అనంతగిరి సబ్ డివిజన్‌లో 675, పెదబయలు సబ్‌డివిజన్‌లో 848, పాడేరు సబ్ డివిజన్‌లో 218, చింతపల్లి సబ్ డివిజన్‌లో 161, అడ్డతీగల సబ్‌డివిజన్‌లో 368, రంపచోడవరం సబ్ డివిజన్‌లో 216, చింతూరు సబ్ డివిజన్‌లో 236 పథకాలు మంజూరయ్యాయి.

సమర్థవంతంగా పోలింగ్

జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశం

సాక్షి,పాడేరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మార్చి 13న జరిగే పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు తొలి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలింగ్ ప్రక్రియలో చిన్న పొరపాట్లకు కూడా తావివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అనుమానాలు ఉన్నా మాస్టర్ ట్రైనర్ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేంత వరకు అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.డీఆర్వో అంబేద్కర్, ప్రత్యేక ఉప కలెక్టర్లు శర్మ, రమణ, అరకు తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానంతో జనన నమోదు
జిల్లా వ్యాప్తంగా ఆధార్ అనుసంధానంతో జనన నమోదులు జరగాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని



ఆధార్ నమోదుపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ శివశ్రీనివాస్,ఇతర అధికారులు

సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ పర్యవేక్షక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిశిఖర గ్రామాలలోని గిరిజనులకు ఆధార్ సమస్య ఉందని,ఆయా ప్రాంతాల్లో ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఉడాయ్ ప్రతినిధి గిరిధర్ మాట్లాడుతూ ప్రతి నెలా సగటున రెండు వేల వరకు జననాలు జరుగుతున్నప్పటికి ఆధార్ ఆధారిత రిజిస్ట్రేషన్లు అతి తక్కువగా ఉంటున్నాయన్నారు. ప్రసవ సమయంలో వైద్యులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆధార్ అనుసంధానంతో జననాలు నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్వో అంబేద్కర్,ఎల్‌డీఎంఎస్ రవితేజ,సీ డీపీవో రూన్సీ,ఈగవర్నెన్స్ జిల్లా సమన్వయకర్త సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బాలికకు డెంగ్యూ



కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న పార్వతి

సీలేరు: చింతపల్లి క్యాంప్ గ్రామానికి చెందిన బాలిక కిలో పార్వతి (12)కి డెంగ్యూ సోకినట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామల తెలిపారు. జ్వరం తగ్గుముఖం పట్టకపోవడంతో చింతపల్లి ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేసినట్టు ఆమె వివరించారు. డెంగ్యూ నిర్ధారణ కావడంతో ఆమెను అక్కడి నుంచి మంగళవారం కేజీహెచ్‌కు తరలించినట్టు వైద్యాధికారి తెలిపారు. అక్కడ చికిత్స పొందుతోందని ఆమె వివరించారు.

వివాహిత అదృశ్యం

సీలేరు: జీకే వీధి మండలం ధారకొండ పంచాయతీ పెట్రాయి గ్రామానికి చెందిన వివాహిత మరిగల శ్రావణి అదృశ్యంపై బంధువులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి

- అదుపు తప్పి జీపు బోల్తా
- ఇద్దరికి తీవ్ర గాయాలు
- అరడకోటలో విషాదఛాయలు

పాడేరు రూరల్: విధులు ముగించుకొని ఇంటికి బయలుదేరిన ఉపాధ్యాయినిని మృత్యువు రోడ్డు ప్రమాదంలో కబళించింది. కుటుంబానికి తీరని శోకం మిగిల్చింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెదబయలు–పాడేరు ప్రధాన రహదారి చింతలవీధి జంక్షన్ సమీపంలోని మంగళవారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం మూసిడిపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న వాలంగి జయకుమారి(30) విధులు ముగించుకుని పాడేరు వెళ్లేందుకు బయలుదేరారు. పెదబయలు నుంచి పాడేరు వెళ్తున్న ప్రైవేటు జీపు ఎక్కారు. చింతలవీధి



ప్రమాదానికి గురైన జీపు

సమీపంలోని ఘాట్‌వద్ద ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న మరోమార్గం నుంచి ఆకస్మాత్తుగా బొలేరో వాహనం ప్రధాన రహదారిపైకి వచ్చేసింది. అదే సమయంలో పాడేరు వెళుతున్న జీపు రోడ్డు దిగుతుండగా అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ వాహనంలో ఉన్న ఉపాధ్యాయిని జయకుమారి ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రంజిత్ వెంటనే ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి పోస్టుమార్టం కోసం జయకుమారి



జయకుమారి మృతదేహం

మృతదేహాన్ని పాడేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త రైల్వే ఉద్యోగి, వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. స్వగ్రామం పెదబయలు మండలంలోని అరడకోట. ప్రస్తుతం పాడేరులో నివాసం ఉంటున్నారు. ఉపాధ్యాయిని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంబరాన్నంటిన సంబరం

- ఘనంగా దొంతులమ్మ జాతర
- భారీగా తరలివచ్చిన భక్తజనం
- కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- ఆకట్టుకున్న చిన్నారుల దేవతామూర్తుల వేషధారణలు
- ప్రత్యేక ఆకర్షణగా రామడోలి



భారీగా తరలివచ్చిన భక్తులు

చింతపల్లి: మండలంలోని తాజంగిలో మంగళవారం నిర్వహించిన దొంతులమ్మ జాతర సంబరాలు అంబరాన్నంటాయి. నాలుగేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరలో రామడోలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.జాతర మూడవ రోజు మంగళవారం కొండపైన ఆలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం గుహల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుహలో దేవతామూర్తుల వేషధారణలో ఉన్న చిన్నారులను గిరిజన పూజార్లు బయటకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి వారిని రామడోలి (ఊయల) ఎక్కించి ఊరేగించారు. అనంతరం వారిని కిందకు దించి ఆలయంలో పూజలు నిర్వహించారు. సంబరాలకు తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు
అమ్మవారి ఆలయంలో ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తుల వేషధారణలతో ఉన్న చిన్నారులతో ముచ్చటించారు. గొప్ప విశిష్టత కలిగిన పండగ మన ప్రాంతంలో జరుపుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు, ఎంపీపీ అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎంపీ ఎమ్మెల్యే

క్లుప్తంగా

భూసర్వే వేగవంతం

సబ్ కలెక్టర్ అభిషేక్

పెదబయలు: భూరీసర్వే వేగవంతం చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ సూచించారు.మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లు రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సర్వే వివరాలను తెలుసుకున్నారు. సర్వేకు వెళ్లే ముందుకు ముందుగా ఆయా గ్రామాలకు సమాచారం అందజేయాలని సూచించారు. సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లడానికి వీలు లేదన్నారు. వివాదాల్లో ఉన్న భూముల సర్వే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించా రు. డీవైఎస్‌వో ఎస్. వెంకటరావు, తహసీల్దార్ బాబూరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా తనిఖీలు

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు గ్రామ శివారులోని అడ్డతీగల– వై.రామవరం ప్రధాన రహదారిలో మంగళవారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టు పార్టీ నేత జనుమూరి శ్రీనుబాబు అలియాస్ సునీల్ అలియాస్ రైనో అరెస్టు నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. దీనిలో భాగంగా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎస్.సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో అడిషనల్ ఎస్ఐ కె.రాంబాబు ఆధ్వర్యంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు, అపరిచితులపై నిఘా ఉంచారు.

రైలు ఢీ కొట్టి వ్యక్తి మృతి

పాయకరావుపేట: నాగరాజుపేట రైల్వే గేటు సమీపాన గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో మృతి చెందినట్టు రైల్వే పోలీసు ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి స్కై బ్లూ కలర్ షర్టు ధరించి ఉన్నారన్నారు. కాళ్లకు, చేతులకు రక్షలు కట్టుకుని ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సర్వం సన్నద్ధం



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- పెట్టుబడుల సదస్సుకు విశాఖ ముస్తాబు
- ఇన్వెస్టర్లకు స్వాగతం పలుకుతున్న నగరం
- ఏయూ మైదానంలో సిద్ధమవుతున్న వేదికలు
- వేదికల వద్ద అదిరిపోయేలా అడ్వాంటేజ్ ఏపీ ఆకృతులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023కు విశాఖ నగరం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. 24 దేశాలకు చెందిన 8 వేలకు పైగా అతిథులు హాజరవుతున్న సదస్సు కోసం ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు నగరానికి చేరుకొని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. బుధవారం సాయంత్రం నుంచి ప్రముఖుల రాకతో నగరం కళకళలాడనుంది. సదస్సు ఏర్పాట్లను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

130 స్టాళ్లు సిద్ధం

జీఐఎస్ కోసం ఏయూ మైదానంలో ఏర్పాటు చేస్తున్న 5 జర్మన్ హ్యాంగర్స్ హాల్స్ పనులు దాదాపు పూర్తయ్యాయి. 14 రంగాల్లో ఇన్వెస్టర్లను ఆకట్టుకొని.. రాష్ట్రంలో ఉన్న వనరులు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించేలా మొత్తం 130 స్టాళ్లు సిద్ధమవుతున్నాయి. సదస్సుకు వచ్చే ప్రతి ఒక్కరికీ స్వాగతం పలికేలా అడ్వాంటేజ్ ఏపీ పేరుతో ప్రత్యేక ఆకృతులు ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొద్ది రోజుల క్రితం ఆమోదించడంతో వాటి ఏర్పా టు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అతిథుల కోసం ఇప్పటివరకు నగరంలోని పలు హోటల్స్‌లో దాదాపు 1100 గదుల్ని అధికారులు బ్లాక్ చేశారు. వీటితో పాటు నగరానికి వస్తున్న పలు సంస్థల ప్రతినిధులు కూడా నగరంలోని స్టార్ హోటల్స్, రిసార్టులు మొదలుకొని సాధారణ ఏసీ హోటళ్లలో గదులు కూడా బుక్ చేసుకోవడంతో ఈనెల 5వ తేదీ వరకు అన్ని నిండిపోయాయి.

ఎగ్జిబిషన్ ప్రారంభించనున్న సీఎం జగన్

ఈనెల 3వ తేదీన ఉదయం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023 ప్రారంభోత్సవంలో దేశ వ్యాప్తంగా వస్తున్న పారిశ్రామికవేత్తలు, విదేశాల నుంచి వస్తున్న ప్రతినిధులతో పెద్ద ఎత్తున ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ప్రధానమైన రంగాలతో పాటు రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలు నడుపుతున్న భారీ పరిశ్రమలను ప్రదర్శించే ఎగ్జిబిషన్ ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారు. దేశంలో ఉన్న ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు 20 నుంచి 25 దేశాలకు సంబంధించిన వివిధ దేశాల ప్రతినిధులు, 12 నుంచి 14 దేశాల అంబాసిడర్స్, వివిధ దేశాలకు సంబంధించి మరో 8 మంది ముఖ్యులు హాజరుకానున్నారు. ఇప్పటికే యూరోపియన్ యూనియన్ నుంచి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నగరానికి చేరుకున్నారు. విశాఖపట్నం సహా రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల వనరులు, స్థానికంగా ఉన్న పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను, అనుకూల వాతావరణాన్ని స్టాళ్ల రూపంలో పెద్ద ఎత్తున ప్రదర్శించనున్నారు.

సమష్టిగా విజయవంతం చేద్దాం..



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్ వలవెన్. చిత్రంలో విశాఖ కలెక్టర్ మల్లికార్జున, సీపీ శ్రీకాంత్, డైరెక్టర్ సృజన

మహారాణిపేట: విశాఖ వేదికగా ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను సమష్టి కృషితో విజయవంతం చేయాలని, ఎలాంటి సమన్వయలోపం లేకుండా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(పరిశ్రమలు, వాణిజ్యం) ఆర్.కరికాల వలవెన్ అధికారులను ఆదేశించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కరికాల వలవెన్ మాట్లాడుతూ ప్రపంచ నలుమూల ల నుంచి వచ్చే అతిథుల మనసు గెలిచేలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని సూచించారు. మర్యాదపూర్వకమైన ప్రవర్తనతో వారిని స్వాగతించాలని, వేదికలను చూపించడంలో వారికి సహకరించాలని చెప్పారు. కమిటీలకుఅప్పగించిన బాధ్యతలను విజ యవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. సదస్సు నిర్వహణకు సంబంధించిన బాగానే ప్రణాళికలు రూపొందించారని, వాటి ఆచరణలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ సదస్సు మన దేశానికి, రాష్ట్రానికి, మన ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తుందని.. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. ఇప్పటివరకు జరిగిన సమ్మిట్‌లు ప్రైవేట్ భాగస్వామ్యంతో జరిగాయని.. ఇది ఈ సదస్సు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకచొరవతోజరుగుతోందనిగుర్తు చేశారు.

కమిటీలు, నోడల్ అధికారులను నియమించాం

కలెక్టర్ ఎ.మల్లికార్జున సదస్సుకు సంబంధించి ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాలు, చేసిన ఏర్పాట్ల గురించి వివరించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ నుంచి సదస్సు ముగిసే వరకు చేపట్టాల్సిన విధులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రధాన సమావేశ మందిరం, ముఖ్యమంత్రికి కేటాయించిన సభాస్థలం, స్టాళ్ల ఇతర వసతుల గురించి తెలిపారు. వీఐపీలు బస చేసేందుకు హోటళ్ల ఏర్పాట్లు చేశామని, సభా ప్రాంగణంలో వారి వాహనాలు నిలిపేందుకు, ఇతర దేశాల నుంచి వచ్చే వారికి కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. టైమ్స్ నెట్‌వర్క్, ఇతర ఈవెంట్ మేనేజ్‌మెంట్లు వారి చేయాల్సిన పనులు, నోడల్ ఆఫీసర్లకు అప్పగించిన బాధ్యతలను వివరించారు. అతిథులను హోటళ్ల నుంచి వేదిక వద్దకు తీసుకొచ్చే విధంగా ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. ప్రతి హోటల్, ప్రధాన వేదిక వద్ద వైద్య బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఎయిర్, సాధారణ అంబులెన్స్‌లు సిద్ధం చేసినట్లు చెప్పారు. అతిథులకు స్థానిక పర్యాటక ప్రాంతాల గురించి వివరించేలా ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశామని, వారికి ప్రత్యేక బ్రోచర్లు అందజేయనున్నట్లు చెప్పారు. పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, జేసీ విశ్వనాథన్, వివిధ ఈవెంట్ మేనేజ్‌మెంట్ల ప్రతినిధులు, వివిధ విభాగాల ప్రాంతీయ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అభినందన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి సమప్రాధాన్యం కల్పిస్తోందని, సర్వమతాల వారికి పెద్దపీట వేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. అరకులోయకు చెందిన పాస్టర్ ఎం.విజయ్ కుమార్‌ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించింది. స్థానిక ఏపీ టూరిజం హరిత గోష్టిలో మంగళవారం నిర్వహించిన అభినందన సభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. కొంతమంది స్వప్రయోజనాలకోసం ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నరన్నారు. పార్టీలు, మతాలకు అతీతంగా సువర్ణ పాలన్న అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు,పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి గంగధార్ స్వామి, ఎంపీపీలు ఉషారాణి, శెట్టి నీలవేణి, ఈశ్వరి,జెడ్పీటీసీ సభ్యులు బొంజ్జిబాబు,జానకి, ఏఎంసీ చైర్మన్ రాజారమేష్,పాస్టర్లు దేవదాస్, బాబూరావు, జాన్,వైఎస్సార్ సీపీ నాయకులు రఘునాథ్, అప్పాలు, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

ఆర్టీసీ భవనంలో స్కిల్ సెంటర్!

- ఏర్పాటు చేయనున్న చమురు సంస్థలు
- విశాఖలో నిర్వహణ బాధ్యత చూడనున్న హెచ్‌పీసీఎల్
- బిల్డింగ్ విస్తీర్ణం 84 వేల చదరపు అడుగులు
- పుష్కర కాలం నుంచి వృథాగా ఐదంతస్తుల భవనం
- అద్దె ద్వారా నెలకు రూ.11.60 లక్షల ఆదాయం



ద్వారకా బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ భవనం

సాక్షి, విశాఖపట్నం: ఆర్టీసీకి చెందిన ఐదంతస్తుల ఆ భవనం ఒకప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలతో కళకళలాడుతూ ఉండేది. పుష్కర కాలం నుంచి ఖాళీగా, వృథాగా ఉంది. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంటోంది. గతంలో ఖాళీగా ఉన్న ఆ బిల్డింగ్‌ను అద్దెకు తీసుకోవడానికి పలు సంస్థలు, ఆస్పత్రుల యాజమాన్యాలు ఆసక్తి కనబరిచాయి. కానీ భవనం కింద ఫ్లోర్‌లో వాణిజ్య దుకాణాలు, దక్షిణం వైపున ద్వారకా బస్‌స్టేషన్, ఉత్తరం దిక్కులో ఓ పెద్ద జ్యూయలరీ షాపు ఉన్నాయి. దీంతో అంత పెద్ద భవనానికి పార్కింగ్ సదుపాయం లేకుండా పోయింది. ఫలితంగా పార్కింగ్ సమస్య వల్ల ఇన్నాళ్లూ ఇది నిరుపయోగంగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ భవనంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు భారతీయ చమురు సంస్థలు సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఓఐఎల్, ఓఎన్‌జీసీ తదితర చమురు సంస్థలు తమ సీఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో దేశంలోని వివిధ నగరాల్లో ఇలాంటి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. విశాఖలోనూ ఈ సెంటర్‌ను నడపడం కోసం ఈ బిల్డింగ్‌ను ఎంపిక చేసుకుంది. ఈ సెంటర్‌కు వచ్చే వారు విద్యార్థులే కావడంతో పార్కింగ్ సదుపాయం అంతగా అవసరం లేదు. దీంతో నగర నడిబొడ్డున, రవాణా సదుపాయం ఉన్న ఈ సువిశాల భవనం తమ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అనువుగా ఉంటుందన్న ఉద్దేశంతో చమురు సంస్థలు లీజు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సెంటర్ నిర్వహణ బాధ్యతను విశాఖ హెచ్‌పీసీఎల్ చూసుకుంటుందని తెలుస్తోంది.

85 వేల చదరపు అడుగులు

ద్వారకా బస్‌స్టేషన్ స్థలంలో దాదాపు 40 ఏళ్ల క్రితం ఆర్టీసీ నిర్మించిన ఐదంతస్తుల ఈ భవనం విస్తీర్ణం సుమారు 84 వేల చదరపు అడుగులు. ఈ భవనానికి చదరపు అడుగుకు నెలకు రూ.13.89 చొప్పున అద్దె చెల్లించేలా చమురు సంస్థలతో ఒప్పందం కుదిరింది. ఈ లెక్కన అద్దె ద్వారా ఆర్టీసీకి నెలకు రూ.11.60 లక్షల ఆదాయం సమకూరనుంది. ఈ భవనం లీజు ఒప్పందం పదేళ్ల పాటు ఉంటుంది.

అవసరమైన పనులు మొదలు



ఈ ఆర్టీసీ భవనాన్ని చమురు సంస్థలకు అప్పగించడానికి ముందు కనీస సదుపాయాలను కల్పించాల్సి ఉంది. విద్యుత్ సదుపాయం, నీటి సరఫరా, డ్రెయినేజీ వంటి వాటిని సమకూర్చడంతో పాటు అవసరమైన పనులు మొదలు పెట్టాం. మరో నాలుగైదు నెలల్లో ఈ భవనం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

–ఎ.అప్పలరాజు, జిల్లా ప్రజా రవాణా అధికారి

స్తంభించిన రాకపోకలు

- ఘాట్‌రోడ్డులో మొరాయించిన వాహనాలు
- రెండు గంటల పాటు నిలిచిన ట్రాఫిక్



ఘాట్‌రోడ్డులో ఏసుప్రభువు విగ్రహం మలుపులో రోడ్డుకు అడ్డంగా నిలిచిన భారీ లారీ

సాక్షి,పాడేరు: మైదాన ప్రాంతాలకు వెళ్లే పాడేరు ప్రధాన ఘాట్‌రోడ్డులో మంగళవారం వేర్వేరు చోట్ల రెండు లారీలు సాంకేతిక కారణాలతో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయాయి. దీంతో రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. మైదాన ప్రాంతాల సిమెంట్ లోడ్‌తో పాడేరు వస్తున్న రెండు లారీలు ఉదయం 8గంటల సమయంలో ఘాట్ ఎక్కుతుండగా మొరాయించి నిలిచిపోయాయి. ఒకటి యేసు ప్రభువు విగ్రహం మలుపు వద్ద మరో లారీ రాజపురం సమీపంలోని మలుపువద్ద రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో సుమారు 2 గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లారీల నిర్వాహకులు మెకానిక్‌ల సాయంతో సాంకేతిక సమస్యలు సరిచేసి లారీలను అక్కడ నుంచి తొలగించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయి.

ఘనంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ జన్మదిన వేడుకలు



అరకులో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు,అధికారులు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ

అరకులోయ రూరల్: ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆరు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు,ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు,మండల పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు, వివిధ అనుబంధ సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు,పార్టీ శ్రేణులు,అధికారులు బొకేలు, దుశ్శాలువాలతో ఎమ్మెల్యేను సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ఉషారాణి, నీలవేణి, బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు చట్టారి జానకమ్మ, బొంజిబాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, మన్యప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వికాష్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాష్ట్ర నాయకులు శెట్టి గంగధార్‌స్వామి, సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ పట్టాసీ సంపత్‌కుమార్, నాయకులు రఘునాథ్,శెట్టి అప్పాలు, బాబూరావు, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు శెట్టి గోపాల్, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనందరావు,లలిత, ఎంపీటీసీలు వరహాలమ్మ,విజయ,స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.బి.సాత్రు, సచివాయల మండల కన్వీనర్ గణపతి, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు శాంతి,మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.ఎంపీపీ రంజపల్లి ఉషారాణి ఆధ్వర్యంలో మాడగడ పంచాయతీ బోగుగూడలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సమక్షంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ముందుగా గ్రామంలో ఎమ్మెల్యేకు థింసా నృత్యంతో స్వాగతం పలికి, ర్యాలీ నిర్వహించారు.

పెదబయలు: ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ జన్మదిన వేడుకలను మండల పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు,వైస్ ఎంపీపీ రాజుబాబు,మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ సర్పంచ్‌లు మత్స్యరాజు,కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ జన్మదిన వేడుకలు అనంతగిరిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శెట్టి ఆనంద్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు మదీన, ప్రధాన కార్యదర్శి డానియల్, కన్వీనర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరాజుపురం సర్పంచ్‌పై టీడీపీ నేతల దాడి

- తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స
- రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికదాడులు
- పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో సర్పంచ్ భార్య శివకుమారి వెల్లడి



కేజీహెచ్‌లో అపస్మాకర స్థితిలో ఉన్న సర్పంచ్ సంతోష్‌కుమార్

దేవరాపల్లి: మండలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన వెంకటరాజుపురం గ్రామ సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్ అలియాస్ చంద్రయ్యపై టీడీపీ నేతలు సోమవారం రాత్రి దాడి చేశారు. రాజకీయంగా ఎదుర్కోలేక, అభివృద్ధిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు పక్కా వ్యూహంతో మూకుమ్మడిగా తన భర్తపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారని సంతోష్‌కుమార్ భార్య శివకుమారి మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక టీడీపీ నాయకుడు లెక్కల సూర్యనారాయణ సహా పది మంది తన భర్తపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని, దీంతో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. టీడీపీ నేతల నుంచి తన భర్తకు ప్రాణ హాని ఉందని రక్షణ కల్పించాలని ఆమె కోరింది. ఇదిలా ఉండగా సూర్యనారాయణ భార్య కుమారి కూడా తన భర్తపై కొందరు దాడి చేసి గాయపరచడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇంచార్జ్ సీఐ హోదాలో చోడవరం సీఐ బి. శ్రీనివాసరావు, స్థానిక ఎస్ఐ డి.నాగేంద్ర మంగళవారం రాత్రి గ్రామంలో పర్యటించి విచారణ చేపట్టారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేశారు.

సర్పంచ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సంతోష్‌కుమార్‌ను దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అతని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. సర్పంచ్‌పై టీడీపీ నేతలు భౌతిక దాడులకు తెగబడడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.

వ్యవసాయ బావిలో యువకుడి మృతదేహం



వీరనాగేంద్ర (ఫైల్)



పరిశీలిస్తున్న డాగ్‌స్క్వాడ్

పాయకరావుపేట: మండలంలోని పి.ఎల్.పురం గ్రామంలో వ్యవసాయ బావిలో యువకుడి మృతదేహం లభ్యమైంది. సంఘటన స్థలం వద్ద నున్న స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పీఎల్ పురం గ్రామానికి చెందిన వడ్లమూరి వీరనాగేంద్ర (22) అదే గ్రామానికి చెందిన మేడిశెట్టి సూర్యానారాయణ అనే దివాణం పొలంలో నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. పొలం పనులను, పశువులను చూసుకుంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి వద్ద నుంచి బయటకు వచ్చి తాను పనిచేస్తున్న పొలం బావిలోనే విగతజీవిగా పడివుండడం స్థానికంగా సంచలనం రేపింది. కాగా మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు వీర నాగేంద్ర ఇంటికి రాకపోవడంతో చుట్టపక్కల వారిని, స్నేహితులను అడగ్గా ఎవరికీ అతని ఆచూకీ తెలియలేదు. గ్రామం సమీపంలోనే ఉన్న పొలం, మకాం, బావి అంతా పరిశీలించారు. బావిలో నీటి అడుగున మృతదేహం ఉన్నట్లు గమనించారు. బావిలో వీరనాగేంద్ర రెండు చేతులు, కాళ్లు తాళ్ళతో కట్టేసి పడిఉన్నాడు. పొలం యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నర్సీపట్నం డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, సీఐ పి.అప్పలరాజు, ఎస్ఐ రమేష్ సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. బావి వద్ద మృతుడి రుమాలు, జోళ్ళు, సెల్‌ఫోన్ గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. అనకాపల్లి క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ వచ్చి సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతుడి తల్లిని డీఎస్పీ ప్రవీణ్ కుమార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. నాగేంద్ర తండ్రి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. నాగేంద్ర మృతిచెందడంతో తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.